# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 04-12-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నౌకాదళ రక్షణ పరికరాల కోసం 21 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలను రక్షణ పరికరాల సేకరణ సమితి ఆమోదించింది.**
2. **రాష్ట్రంలో నీటి లభ్యత పెరిగేలా సమగ్ర నీటి విధానాన్ని రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **హైదరాబాదు నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ గ్లోబల్ కాంపిటేటివ్ సెంటర్స్ విధానానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
5. **శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రం నుంచి పిఎస్ఎల్వి సి -59 రాకెట్ ద్వారా ప్రోబా 3 ఉపగ్రహాలను ఈరోజు ఇస్రో ప్రయోగించనుంది.**

==========================

నౌకాదళ రక్షణ పరికరాల కోసం 21 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలను రక్షణ పరికరాల సేకరణ సమితి ఆమోదించింది. ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిన్న జరిగిన కౌన్సిల్ సమావేశంలో భారత నావికాదళం కోసం 31 కొత్త వాటర్ జెట్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్‌ల సేకరణకు అనుమతినిచ్చింది. వీటి ద్వారా సముద్ర భద్రతా కార్యకలాపాలు, నిఘా, పెట్రోలింగ్, శోధన, సహాయక చర్యలు వంటి కార్యకలాపాలను నిర్వహించనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే 120 ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ క్రాఫ్ట్‌ల సేకరణకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇవి దేశంలోని ద్వీప ప్రాంతాల రక్షణలో ప్రభావవంతమైన పాత్రను పోషిస్తాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

------------------------

రాష్ట్రంలో కరవు వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేలా సమగ్ర నీటి విధానాన్ని రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నిన్న సమీక్షించార. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నదులు, వర్షాల ద్వారా రాష్ట్రంలో నీటి లభ్యతను పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు షెడ్యూలును రూపొందించాలని చెప్పారు. హంద్రీనీవా కాలువ లైనింగ్, వెడల్పు పనులకు సంబంధించి త్వరగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని, పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. వెలిగొండ

పనులను 2026 జూన్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

హైదరాబాదు నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దే లక్ష్యంతో నగరంలో ఏడు వేల కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలనా విజయోత్సవాలలో భాగంగా పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రానికి మణిహారమైన ప్రాంతీయ బాహ్య వలయ రహదారి నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఓ.ఆర్.ఆర్. కు అనుబంధంగా ముచ్చర్ల ప్రాంతంలో 40 నుండి 50 వేల ఎకరాలలో అద్భుతమైన నగరాన్ని నిర్మిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొంటూ .....

వాయిస్... 33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్ది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ గ్లోబల్ కాంపిటేటివ్ సెంటర్స్ విధానానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమాచార, పౌర సంబంధాల శాఖమంత్రి కె పార్ధసారధి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న జరిగిన రాష్ట్రమంత్రి వర్గం సమావేశంలో పలు నిర్ణయాలను మంత్రివర్గం ఆమోదించింది. ఈ నిర్ణయాలను మంత్రి పార్ధసారధి పాత్రికేయులకు వెల్లడించారు.

...వాయిస్....32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ రోజు సాయంత్రం నాలుగు గంటల ఎనిమిది నిమిషాలకు పిఎస్ఎల్వి సి -59 రాకెట్ ద్వారా ప్రోబా 3 ఉపగ్రహాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో ప్రయోగించనుంది. పిఎస్ఎల్విసి -59 ద్వారా ఐరోపా అంతరిక్ష సంస్థకు చెందిన ప్రొబా-3 ఉపగ్రహాలను భూమి దీర్ఘ వృత్తాకార కక్ష్యలోకి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశపెడతారు.

---------------------------

భారత దేశ తీర ప్రాంతాన్ని పటిష్టంగా ఉంచడంలో నౌకాదళం అందిస్తున్న విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఈ రోజు నౌకాదళ దినోత్సవం నిర్వహిస్తున్నారు. భారత - పాకిస్తాన్ యుద్ధం సందర్భంగా 1971 వ సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన పాకిస్తాన్‌లోని కరాచీ హార్బర్ పై భారత నౌకా దళం మెరుపు దాడి చేసి ఆ దేశానికి తీవ్ర నష్టం కలిగించాయి. భారత నౌకాదళం జరిపిన ఈ దాడిలో పాకిస్తాన్‌కు చెందిన నాలుగు నౌకలు మునిగిపోయాయి. ఇంధన నిల్వ క్షేత్రాలు కూడా ధ్వంసం కావడంతో పాకిస్తాన్‌కు భారీ నష్టం వాటిల్లింది. భారత నౌకా దళం "ఆపరేషన్ ట్రైడెంట్" పేరుతో ఈ దాడి నిర్వహించింది. ఈ ఆపరేషన్ విజయ స్మృతులను గుర్తు చేసుకుంటూ దేశ ప్రజలు ఈ రోజు నౌకా దళ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

అమరావతి రాజధాని ప్రాంతంలో వచ్చే మూడేళ్ళలో ముఖ్యమైన నిర్మాణాలను పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశానంతరం మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.... రాజధాని అభివృద్ధిపై రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ–సీఆర్డీఏ సమావేశ నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. అమరావతిని ప్రపంచంలోనే ఐదు అద్భుతమైన రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ తెలియజేస్తూ,

వాయిస్....28 సెకన్లు

---------------------------

తెలంగాణలో భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. 'బిల్డ్ నౌ' విధానాన్ని హైదరాబాద్‌లో మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణాభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉంటున్నందున ఈ శాఖకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నామని స్థిరాస్తి రంగంలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

---------------------------

ఫెయింజల్ తుఫాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తుపాను బలహీనపడినప్పటికీ దాని ప్రభావంతో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు.. రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. తుపాను ప్రభావంతో తెలంగాణలోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు.

======================